RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 292 సెప్టెంబర్ 9 బుధవారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

రాగద్వేషాలకు అతీతంగా క్షేత్రస్థాయిలోని నాయకులు పనిచేయాలి



అమరావతి, సెప్టెంబర్ 8 : స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి గెలవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కొందరు దింపుడు కళ్లెం ఆశతో 'సర్' పైనా, రిజర్వేషన్లపైనా కోర్టులకు వెళ్లారని విమర్శించారు. ఈరోజు (మంగళవారం) మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ నేతలకు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహంపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మేయర్లు, చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలని నిర్ణయించామని అన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలనే ఈ ప్రక్రియ చేపట్టామని వెల్లడించారు. బెస్ట్ అభ్యర్థులను నిలిపేలా ప్రతి ఒక్కరం జాగ్రత్త పడాలని సూచించారు. పార్టీకి, ప్రభుత్వానికి నష్టం లేకుండా చూడాలని నిర్దేశించారు. పార్టీకి ప్రభుత్వానికి చెడ్డపేరు లేకుండా అభ్యర్థుల ఎంపిక జరగాలని ఆదేశించారు. ఆయా కమిటీల ద్వారా ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ముందుకెళ్దామని సూచించారు. గెలుపే ధ్యేయంగా పనిచేయటంతో పాటు కూటమిగా బ్యాలెన్సింగ్ జరగాలని మార్గనిర్దేశం చేశారు. విశాఖపట్నం నార్త్ మినహా నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమించామని తెలిపారు. రాగద్వేషాలకు అతీతంగా క్షేత్రస్థాయిలోని నాయకులు పనిచేయాలని ఆదేశించారు. పార్టీకి నష్టం కలిగించే ప్రయత్నం చేస్తే సస్పెన్షన్ వేటు పడుతుందని గుర్తుంచుకోవాలని హెచ్చరిం చారు. మనం అంతా స్ఫూర్తితో కలసి కట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిద్దామని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే

సెప్టెంబర్ 8 : ఆంధ్రప్రదేశ్‌లో నిత్యా వసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించను న్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం.. అసెంబ్లీ స్పీకర్ కులాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్నారు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 : సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అనుచిత వ్యాఖ్యలతో రెచ్చిపోయారు. క్రిమినల్ మనస్తత్వం ఉన్న సీఎం తెలంగాణకు ఉండటం దురదృష్టమని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని, చీర లాగారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి.. అసెంబ్లీ స్పీకర్ కులాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లుగా గజ్వేల్‌కి కాంగ్రెస్ గూండాలను, పోలీసులను పంపించారని ఆగ్రహించారు. రేవంత్‌రెడ్డి మనసులో మాటను ఇద్దరు శాసన సభ సభ్యులు మాట్లాడారని చెప్పుకొచ్చారు. 'కేసీఆర్ ఎందుకు చావాలి..? తెలంగాణను అభివృద్ధి చేసినందుకా..?. సిగ్గులేకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. చావు ఎవరికైనా వస్తుంది.. అందరి కంటే ముందు కాంగ్రెస్‌కే ఆ చావు వస్తుంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చెప్పిన మాట తప్పారు.. హామీల అమలు గురించి అందరూ అడుగుతున్నారు. ఇద్దరిని సస్పెండ్ చేస్తారు అట.. నీ జాగీరు కాదు. అసలు టార్గెట్ కేసీఆర్ కాదు.. మీకు హామీల అమలు మీద టార్గెట్ ఉండాలి. మా నాయకుడు దగ్గరకెళ్తుంటే మమ్మల్ని అరెస్ట్ చేశారు.

డప్పు, చర్మకారుల పెన్షన్ల నమోదు కొరకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి : సుజన్ మాదిగ

ఒంగోలు, అక్షర ప్రకాశం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా డప్పు, చర్మకారుల పెన్షన్లకు అప్లై చేసుకునేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఒంగోలులోని ఎం ఎస్ పి ఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నూతనంగా పింఛన్ల కొరకు దరఖాస్తులు నమోదు చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం చెప్పున్నప్పటికీ డప్పు, మరియు చర్మ కారులు చేతివృత్తులపై ఆధారపడిన వారికి పింఛన్లు కొరకు నమోదు చేసేందుకు, స్పష్టమైన మార్గదర్శకాలను గ్రామ సచివాలయాలకు అందించకపోవడంతో, ఆ వృత్తిని నమ్ముకున్న పేద కుటుంబాలు అయోమయానికి గురయ్యారని సుజన్ మాదిగ తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా, ఈ రెండు వృత్తులు చేపట్టే వారిని ఎంపిక చేసే విధానాన్ని స్పష్టంగా తెలియజేయక పోవడం ద్వారా, వారు సులువుగా దరఖాస్తులు చేసుకోలేక పోతున్నారని, స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకుండా వారం రోజులలో దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పి ఉన్నారని, కానీ ఈ రెండు వృత్తుల వారికి స్పష్టమైన మార్గదర్శకాలని ఇవ్వకుండా ఉండటంపై, ఆ వృత్తిని నమ్ముకున్న వృత్తిదారులు ఆవేదన చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి మాదిగ ,మాదిగ ఉప కులాల అందరము ఓట్లు వేసి గెలిపించామని, ఈ సామాజిక వర్గం వారు మాత్రమే డప్పులు కొట్టడం మరియు చెప్పులు కుట్టడం ద్వారా జీవనాన్ని కొనసాగిస్తున్నారని, వారికి అందించే పెన్షన్ మంజూరులో స్పష్టమైన ఆదేశాలను సత్వరమే అందజేసి వారి జీవన భృతిని తోడ్పాటు అందించాలని సుజన్ మాదిగ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ పిఎస్ నాయకులు

గద్దె త్యాగరాజు, అప్పారావు, జయరాజు, నారాయణ, కొలకలూరి. బాలాజీ మాదిగ, సింగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, పాఠశాలల్లో ఆహార నాణ్యతపై రాజీ వద్దు

- మధ్యాహ్న భోజనం, రేషన్ పంపిణీ పకడ్బందీగా అమలు చేయాలి

- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి

మద్రిపూడి, అక్షర ప్రకాశం : అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీ విజయ్ ప్రతాప్ రెడ్డి ఆదేశించారు. చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ కూడా ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా జరగాలని సూచించారు. మంగళవారం.

మద్రిపూడి మండలంలోని గార్లపేట ఎస్సీ కాలనీ, ఓసీ కాలనీ, వేమవరం, మద్రిపూడి ఎస్సీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చౌక ధరల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కూచిపూడి హైస్కూల్, చౌక ధరల దుకాణంతో పాటు రావెళ్లవారిపాలెంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) పరిశీలించారు.

మధ్యాహ్న భోజనంపై తల్లిదండ్రుల ఫిర్యాదు

కూచిపూడి హైస్కూల్‌ను సందర్శించిన సందర్భంగా అక్కడ మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన విజయ్ ప్రతాప్ రెడ్డి స్వయంగా విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆహారం నాణ్యత సరిగా లేదని విద్యార్థులు కూడా చెప్పడంతో విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. వెంటనే మద్రిపూడి మండల తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్రిమెన్ కమిటీ ద్వారా తక్షణమే విచారణ జరిపించి బాధ్యులైన వంట సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే కొత్త వంట సిబ్బందిని నియమించాలని సూచించారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంపై నిఘా

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులకు సూచించారు. బియ్యం, పప్పులు, గుడ్లు, పాలు, బాలామృతం తదితర నిల్వల రికార్డులు పక్కాగా నిర్వహించాలని చెప్పారు. గడువు ముగిసిన సరుకులు ఉండకుండా చూడాలని, పిల్లల బరువు, ఎత్తు కొలిచే పరికరాల పనితీరు, కేంద్రాల పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలను కూడా తనిఖీ చేయాలన్నారు. వేమవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఇండక్షన్ స్టవ్ ఏర్పాటు, సరుకులు పెట్టుకోవడానికి టేబుల్ కొనుగోలు కోసం తన సొంత నగదు రూ.2 వేలను అంగన్‌వాడీ టీచర్‌కు విజయ్ ప్రతాప్ రెడ్డి అందజేశారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు తావు వద్దు

చౌక ధరల దుకాణాల్లో ఈ-పోస్ యంత్రాల పనితీరు, ఎలక్ట్రానిక్ తారాజుల ప్రామాణికతను నిరంతరం పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం నాణ్యత, బస్తాల బరువు, నిల్వల రికార్డులు, కార్డుదారుల బయోమెట్రిక్ వివరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. అర్హులైన కార్డుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాయితీ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వంటశాలల పరిశుభ్రత తప్పనిసరి

పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో రోజువారీ మెనూ ప్రకారం వేడివేడి, నాణ్యమైన భోజనం అందించాలని చైర్మన్ సూచించారు. వంటశాలల పరిశుభ్రతతో పాటు వంటకు వినియోగించే నూనె, పప్పులు, ఐయోడైజ్డ్ ఉప్పు తదితర సరుకుల నాణ్యతను పరిశీలించాలని తెలిపారు. విద్యార్థులకు వడ్డించే ముందు ఉపాధ్యాయులు భోజనాన్ని రుచి చూసే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, వంట సిబ్బంది పరిశుభ్రతా నియమాలు పాటిస్తున్నారో లేదో పర్యవేక్షించాలని సూచించారు. కేజీబీవీ, ఇతర సంక్షేమ వసతిగృహాల్లో అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనాల నాణ్యతతో పాటు స్టాక్ రిజిస్టర్లు, డైనింగ్ హాల్స్, మరుగుదొడ్ల పరిశుభ్రతను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థి ప్రతిభకు ప్రోత్సాహం

రావెళ్లవారిపాలెం కేజీబీవీలో పదో తరగతిలో 577 మార్కులు సాధించిన విద్యార్థికి రూ.2 వేల నగదు అందజేశారు. ఆ నగదుతో మంచి చేతి గడియారం కొనుగోలు చేసుకోవాలని సూచిస్తూ విద్యార్థిని అభినందించారు.

రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్య అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని విజయ్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన విద్యార్థులకు నేరుగా చేరాలని, నిర్లక్ష్యం లేదా అవకతవకలను సహించబోమని హెచ్చరించారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని, సాధారణ విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, ఆంగ్ల భాషపై పట్టు పెంచుకుని ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

913 ఆశా పోస్టుల భర్తీకి ఆమోదం

- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 1,294 పోస్టుల భర్తీ
- జీరో వెకెన్సీ దిశగా ఆశా పోస్టుల భర్తీ
- రెండేళ్లలో 2,207 మంది ఆశా కార్యకర్తలకు అవకాశం
- ప్రకాశం జిల్లాలో 38 పోస్టులు ఖాళీ
- ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10 వేల వేతనం

అమరావతి, అక్షర ప్రకాశం : ప్రజల ముంగిటకు ప్రాథమిక వైద్య సేవలను చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా కార్యకర్తల ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా (అక్రిడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్) పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ పోస్టుల భర్తీతో రాష్ట్రంలో ఆశా కార్యకర్తల పోస్టులను జీరో వెకెన్సీ విధానంలో పూర్తిస్థాయిలో భర్తీ చేసినట్లవుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో ఇప్పటికే 1,294 ఆశా పోస్టులను భర్తీ చేశామని, తాజాగా ఆమోదం పొందిన 913 పోస్టులతో కలిపి మొత్తం 2,207 పోస్టులు భర్తీ చేసినట్లవుతుందని మంత్రి పేర్కొన్నారు. తాజా ఖాళీల్లో 673 గ్రామీణ, 64 గిరిజన, 176 పట్టణ ప్రాంతాల పోస్టులు ఉన్నాయని వివరించారు.

డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా నియామకాలు

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆశా కార్యకర్తల నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేసే డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ద్వారా నియామకాలు నిర్వహించనున్నారు. సంబంధిత గ్రామం లేదా వార్డుకు చెందిన స్థానిక మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పదో తరగతి కనీస విద్యార్హతతో పాటు 25 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళలు అర్హులుగా ఉంటారని తెలిపారు. నియమ నిబంధనలకు అనుగుణంగా నియామక ప్రక్రియ పూర్తి చేసి, ఈ నెల 30వ తేదీ నాటికి నియామకాల జాబితాను పంపాలని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు తెలిపారు.

ప్రకాశం జిల్లాలో 38 ఖాళీలు

జిల్లాల వారీగా ఆశా పోస్టుల ఖాళీలను పరిశీలిస్తే అనకాపల్లిలో అత్యధికంగా 77 పోస్టులు, కర్నూలులో 65, తూర్పుగోదావరిలో 44, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 43, పార్వతీపురం మన్యంలో 43, పశ్చిమగోదావరిలో 42, అన్నమయ్యలో 41 ఖాళీలు ఉన్నాయి. ప్రకాశం జిల్లాలో 38 పోస్టులు, వైఎస్సార్ కడపలో 38, కృష్ణాలో 37, విశాఖపట్నంలో 33, చిత్తూరులో 32, కోనసీమలో 32, పల్నాడులో 31, విజయనగరంలో 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాకినాడ, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల్లో చెరో 29, ఏలూరులో 27, అనంతపురంలో 26, మార్కాపురంలో 25 పోస్టులు ఉన్నాయి. శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం జిల్లాల్లో చెరో 22, గుంటూరు, నంద్యాల, పోలవరం, తిరుపతి జిల్లాల్లో చెరో 21, ఎన్టీఆర్ జిల్లాలో 15, బాపట్ల జిల్లాలో 7 ఆశా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

నెలకు రూ.10 వేల వేతనం

ఆశా కార్యకర్తలకు ప్రస్తుతం నెలకు రూ.10 వేల చొప్పున వేతనం అందుతోంది. ఇందులో రూ.8,320 రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ద్వారా అందుతుండగా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలకు ప్రతి ఏడాది వేతనాల రూపంలో సుమారు రూ.513 కోట్ల వరకు చెల్లింపులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.426.84 కోట్ల వరకు భరిస్తుండగా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. తాజా 913 పోస్టుల భర్తీతో గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు మరింత చేరువ అవుతాయని వైద్య, ఆరోగ్య శాఖ భావిస్తోంది.

సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యం.. వయోజన విద్య డిడి జగన్మోహనరావు

మద్దిపాడు, అక్షర ప్రకాశం : వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అక్షరాంధ్ర కార్యక్రమం అమలవుతుందని వయోజన విద్య జిల్లా డిప్యూటీ డైరెక్టర్ బి. జగన్మోహనరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా మద్దిపాడులో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అక్షరాస్యత ర్యాలీ చేపట్టారు. అక్షరాస్యత ఆవశ్యకత ను తెలియజేస్తూ నినాదాలు చేశారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో గౌరవ ఎంపిడిఓ శ్రీనివాస వర ప్రసాద్ అధ్యక్షతన సభ నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనం చేసి సభను ఆరంభించారు. అక్షరాంధ్ర రెండో విడత కార్యక్రమంలో జిల్లా పరిధిలో 98,475 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారి వివరాలు అక్షరాంధ్ర యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశామని వివరించారు. ఈ రోజు అనగా సెప్టెంబర్ 8 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించాలని కోరారు. వంద గంటల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఎంఈవో ఆంజనేయులు, ఏపిఓ సురేఖ, పలువురు వయోజన విద్య పర్యవేక్షకులు, వెలుగు సిసి లు, వివిధ గ్రామాలకు చెందిన విఓఏలు, పలువురు విశ్రాంత ఉద్యోగుల సభలో పాల్గొని మాట్లాడారు.

జె.యన్.టి.యు. కాకినాడ వారిచే ఏ ప్లస్ గ్రేడ్ పొందిన సెయింట్ ఆన్స్

చీరాల, అక్షర ప్రకాశం : జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ, కాకినాడ వారిచే సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, ఏ ప్లస్ గ్రేడు పొందినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు మరియు కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణ రావు సంయుక్తముగా ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ, కాకినాడ 19వ వ్యవస్థాపక మరియు ఉపాధ్యాయు దినోత్సవము సందర్భముగా సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజికు ఏ ప్లస్ గ్రేడును ప్రకటించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జగదీష్ బాబు తెలిపారు. యునివర్సిటి పరిధిలోగల 159 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా అందులో 17 కళాశాలలకు ఏ ప్లస్ గ్రేడు లభించగా అందులో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి ఒకటి అని తెలిపారు. కళాశాలలోని మౌలిక వసతులు, ఆధునిక ల్యాబొరేటరీలు, అత్యధిక విద్యార్హత కలిగిన అధ్యపకులు, విద్యార్థుల సంఖ్య మొదలగు ఆధారముగా యూనివర్సిటి వారు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి ఏప్లస్ గ్రేడ్ సాధించినట్లు తెలిపారు. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, ఏప్లస్ గ్రేడ్ సాధించిన సందర్భంగా కళాశాల యాజమాన్యమునకు డాక్టర్ సి. సుబ్బారావు, డైరక్టర్, (అక్రిడిటేషన్స్) ఆర్. వి.రమణ మూర్తి, మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్) వనమా దొర నాగ సాయినాథ్, మేనేజర్, డైరక్టర్ (అడ్మినిస్ట్రేషన్) వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఆధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నిర్దిష్ట గడువులోపు రీసర్వే పూర్తి చేయాలి

- ఒంగోలు డివిజన్ రెవెన్యూ అధికారుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆదేశం

ఒంగోలు, అక్షర ప్రకాశం : భూముల రీసర్వే ప్రక్రియను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవన్‌లో నిర్వహించిన ఒంగోలు డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల సదస్సులో ఆమె పాల్గొని పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేసి రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆరో విడత రీసర్వే కొనసాగుతున్న నేపథ్యంలో మండలాల వారీగా పనుల పురోగతిని ఆమె సమీక్షించారు. నిర్దిష్ట గడువులోపు పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు

చేపట్టాలని స్పష్టం చేశారు. రీసర్వే పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు సూచించారు. పొరపాటున తమ భూములు 22 (ఏ) జాబితాలో నమోదయ్యాయని ప్రజలు సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన వారికి క్లియరెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూముల మ్యుటేషన్లు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. వివరాలన్నీ సక్రమంగా ఉన్న భూములకు సంబంధించిన పాస్‌పుస్తకాల ముద్రణ,

పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని చెప్పారు. అలాగే 'సర్' కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో పి. వెంకటరమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రజలు వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

కొండపి, అక్షర ప్రకాశం : వినాయక మండపాలను ఏర్పాటు చేసే ప్రతి కమిటీ వారు స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ముందుగా అనుమతి తీసుకోవాలి... మండపాల వద్ద అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా నిర్వాహకులు ఎప్పుడూ ఇద్దరు లేదా ముగ్గురు వాలంటీర్లను కాపలాగా ఉంచాలి... షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్ల ద్వారానే కరెంటు వైరింగ్ చేయించుకోవాలి... జన సంచారానికి, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగని విధంగా రద్దీ లేని ప్రాంతాలలో మండపాలను ఏర్పాటు చేయాలి... రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యం జరగకుండా డీజేలు, లౌడ్ స్పీకర్ల వాల్యూమ్ పరిమితిలో ఉంచాలి... అర్ధరాత్రి 10 గంటలు దాటిన తర్వాతశబ్దాలు చేయడానికి అనుమతి లేదు... మండపాల వద్ద టపాసులు కాల్చడం పూర్తిగా నిషేధించబడింది. అలాగే పూజా సామాగ్రి, అగరవత్తులు పెట్టేటప్పుడు నిప్పు రవ్వలు మండపానికి తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి... వినాయక మండపాల వద్ద మరియు నిమజ్జన ఊరేగింపులలో మద్యం సేవించి గొడవలు సృష్టించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే నిర్వాహకులపై కఠిన చర్యలు ఉంటాయి. విగ్రహాల నిమజ్జనాన్ని పోలీసు శాఖ సూచించిన మార్గదర్శకాల ప్రకారం, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలి. రద్దీ ప్రాంతాల్లో మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై నిఘా ఉంచాలి.

ధనలక్ష్మిగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి

- ముగిసిన శ్రావణ మాస వరలక్ష్మి పూజలు



ఒంగోలు, అక్షర ప్రకాశం : శ్రావణ మాసంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని లక్ష్మీదేవి అష్టరూపాలలో నాలుగు శుక్రవారాలు, నాలుగు మంగళవారాలు పూజించి కుంకుమార్చనలు చేయడం జరిగిందని, ప్రతివారం పెద్దసంఖ్యలో భక్తురాండ్రు పాల్గొని విశేషముగా వరలక్ష్మి పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి కటాక్షములతో కుటుంబ అభివృద్ధి, సౌభాగ్యము, పిల్లల భవిష్యత్తు బాగుంటుందని ఆలయ అర్చకులు లొల్లా సూర్యనారాయణ శాస్త్రి తెలిపారు. 8వ తేదీన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవి ధనలక్ష్మిగా భక్తులను అనుగ్రహించారు. తొలిగా గణపతి పూజ, అనంతరం లక్ష్మీదేవికి ఆవాహన, షోడశోపచారాది ప్రత్యేక పూజలు చేయించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవిని శోభాయమానంగా కరెన్సీతో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ తదియారాధన సంఘం ప్రతినిధులు అలంకరించారు. పూజానంతరం భక్తి శ్రద్ధలతో గుడి ఉత్సవం, పల్లకిసేవ నిర్వహించారు. ఎనిమిదవ వారం సందర్భముగా పూజలో పాల్గొన్న మహిళల్లో ఎనిమిది మందికి అమ్మవారి కృపతో చీరలను బహుకరించారు. చివరిగా ప్రసాద వితరణగావించారు.

గృహప్రవేశంలో పాల్గొన్న మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూరే నాగేశ్వరరావు

గిద్దలూరు, అక్షర ప్రకాశం : ఈరోజు ఒంగోలు పట్టణంలోని ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ మువ్వల శ్రీనివాసరావు గారి గృహప్రవేశ కార్య క్రమంలో ప్రకాశం జిల్లా కార్య వర్గము అధ్యక్షుడు బొగ్గవరపు సుబ్బా రావు మరియు మహాసభ కమిటీ సభ్యులు మరియు ప్రకాశం జిల్లా మండలా ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెం ట్లు అందులో గిద్దలూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూరే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,